క్లుప్తంగా

49 మందికి వైద్య సేవలు

గజపతినగరం: మండలంలోని లోగీశ గ్రామంలో 104 ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 49 మందికి వైద్య తనిఖీలు చేసి మందులు ఉచితంగా అందజేసినట్లు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు పుష్పాంజలి తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలందించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

డ్రాపౌట్లపై ప్రత్యేక దృష్టి

గుర్ల: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లాలని ఎంఈఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతలపేటలో 4వ తరగతి విద్యార్థి కె.గ్రీష్మంత్ చదువు మధ్యలో మానేయడంతో శుక్రవారం విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. చదువుకోవడం వల్ల మంచి భవిష్యత్ ఉంటుందని, పిల్లాడిని బడికి పంపించాలని విద్యార్థి తల్లిదండ్రులను కోరారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన చింతలపేట హైస్కూల్ విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట హెచ్‌ఎం గౌరీదేవి, పీఈటీ లక్ష్మణ్ ఉన్నారు.

పూజా సామగ్రి అందజేత

మెరకముడిదాం: మండలంలోని పలు ఆలయాలకు దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. గర్భాం, గొట్టిపల్లి గ్రామాల్లో ఉన్న ఆలయాలకు దూపదీప నైవేద్యాలకు అవసరమైన పూజా సామగ్రిని ట్రస్ట్ సభ్యుడు గేదెల భాస్కరరావు, రామారావు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాలకు పూజా సామగ్రిని ఉచితంగా అందజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

విద్యార్థినులకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ, తదితరులు

చీపురుపల్లి: ఆంధ్రా యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. పీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.జ్వాలాముఖి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ పి.రామలక్ష్మి, అధ్యాపకులు క్రీడాకారులను అభినందించారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ మహిళా కబడ్డీ చాపియన్‌షిప్ పోటీలు జరిగాయి.

దోమల నివారణ మందు పిచికారీ

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో చిన్నిపాలెం, జోగయ్యపాలెం, సింహాద్రిపురం గ్రామాల్లో శుక్రవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. సర్పంచ్ రంగడు పద్మలత ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది దోమల నివారణ మందు స్ప్రే చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బహిరంగ మలవిసర్జన చేయరాదని హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరరావు గ్రామస్తులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చోరీ కేసు నిందితులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలో ఇటీవల జరిగిన చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. గరివిడిలో గర్భాం రోడ్డులో ఈనెల 21న చెరుకూరు వెంకటరమణమూర్తికి చెందిన ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారం, వెండి వస్తువులతో పాటు టీవీ, కొంత నగదు చోరీకి గురైంది. వెంకటరమణ ఫిర్యాదు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులైన దశమంతుల జగదీష్(జాక్సన్), బంగారు సోమశేఖర్‌తో పాటు మరో మైనర్‌ను విజయనగరం పూల్‌బాల్ ఎన్‌టీఆర్ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. లోకేశ్వరరావు, సిబ్బంది.

పాఠశాల సందర్శన

వేపాడ: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణ సూచించారు. మండలంలోని పెదగుడిపాల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. వారితో పాఠ్యాంశాలను చదివించారు. దస్తూరీ మెరుగుపర్చుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన మెనూ కచ్చితంగా అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

ఎంపీడీఓ పరిశీలన

వేపాడ: జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాల రికార్డులు, అందుబాటులో ఉన్న వసతులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో బోర్డుపై గణితం చేయించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ప్రశ్నార్థకంగా పైపులైన్ నిర్వహణ

- మురుగునీటి మధ్యలో తాగునీటి పైపులైన్లు
- మ్యాన్‌హోల్స్‌పై కనబడని పైకప్పులు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది


లక్ష్మీపురం రక్షిత మంచినీటి పథకం వద్ద ఉన్న మ్యాన్‌హోల్ పరిస్థితి


జె.డి.వలస వద్ద మ్యాన్‌హోల్ పక్కన పడేసిన పైకప్పు


గొడికొమ్ము వద్ద పైకప్పు లేకుండా ఉన్న మ్యాన్‌హోల్


లక్ష్మీపురంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం

జామి: ప్రస్తుతం ఎక్కడ చూసినా డయేరియా, విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గుర్ల మండలంలో డయేరియాతో పలువురు మృత్యువాత పడ్డారు. కలుషిత నీరే దీనికి కారణంగా అధికారులు గుర్తించారు. అయినా తాగునీటి ట్యాంకులు, పైపులైన్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షిత నీటిని అందించాలన్న ధ్యాస అంతకంటే లేదు. మండలంలో రక్షిత మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసే తాగునీటి స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారింది. ట్యాంకుల శుభ్రత, పైపులైన్ల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారనేందుకు మ్యాన్‌హోల్సే నిదర్శనంగా చెప్పవచ్చు. మండలంలో లక్ష్మీపురం వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం (ఓవర్‌హెడ్ ట్యాంకు) నుంచి పైపులైన్ల ద్వారా లక్ష్మీపురం, జేడీవలస, గొడికొమ్ము, లొట్లపల్లి, తదితర గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. పైపులైన్ల నిర్వహణకు వీలుగా అక్కడక్కడ మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. వాటిపై మూతలు ఏర్పాటు చేయకపోవడం మరిచిపోయారు. కొన్నిచోట్ల పైకప్పులు ఏర్పాటు చేసినా పైపులైన్ మరమ్మతుల సమయంలో వాటిని తొలగించి అలానే వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు మ్యాన్‌హోల్స్‌లో మురుగునీరు చేరి నిలిచిపోయింది. పైపులైన్ లీకుల ద్వారా నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. అధికారులు స్పందించి పైపులైన్లను శుభ్రం చేయడంతో పాటు మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పైపులైన్లను శుభ్రం చేసే సమయంలో సిబ్బంది మ్యాన్‌హోల్స్‌పై ఉన్న మూతలను తొలగించి వదిలేసినట్టున్నారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయిస్తున్నాం. ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం.
– పార్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

డొంకాడలో డయేరియా


పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రామకృష్ణ

గంట్యాడ: గుర్ల గ్రామంలో విజృంభించిన డయేరియా క్రమంగా అన్ని మండలాలకు వ్యాప్తి చెందుతోంది. గుర్ల, గజపతినగరం, కొత్తవలస మండలాల్లో ఇప్పటికే డయేరియా కేసులు నమోదయ్యాయి. గుర్లలో డయేరియా బారినపడి 14 మంది మృత్యువాత పడ్డారు. తాజాగా గంట్యాడ మండలం డొంకాడ గ్రామంలో ఏడు డయేరియా కేసులు నమోదయ్యాయి. గ్రామానికి చెందిన బి.సన్యాసి, పి.సావిత్రి, విశ్వనాథం, కమల, తాత, అప్పారావు డయేరియా బారినపడి కోలుకున్నారు. రామకృష్ణ అనే వ్యక్తి పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు. గ్రామంలో డయేరియా వ్యాప్తి చెందడంతో పెదమజ్జిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తాగునీటి పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంక్‌లను పరిశీలించి నీటి పరీక్షలకు శాంపిల్స్ సేకరించారు.

కేంద్రం నిధులతో అభివృద్ధి పనులు


కాలువ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

చీపురుపల్లి: పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ తెలిపారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి జగన్నాథరాజు కాలనీలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమ్మెంటు కాలువ పనులకు శుక్రవారం జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామసభల్లో 80 పనుల వరకు తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపగా అందులో 17 పనులు మంజూరైనట్లు చెప్పారు. వాటిని చేపట్టేందుకు రూ.1.17 కోట్లు ఉపాధి నిధులు విడుదలైనట్లు తెలిపారు. ఆయా పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, సూరు దుర్గారావు, ముల్లు పైడిరాజు, దాలయ్య, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ జట్టుకు దెందేరు విద్యార్థులు


జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొత్తవలస: మండలంలోని దెందేరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు వాలీబాల్ అండర్-14 జిల్లా జట్టులో స్థానం పొందినట్టు పాఠశాల పీడీ కె.కృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ స్టేడియంలో గురువారం జరిగిన ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులు గొర్లె రేవతి, యామని, మదినా యోగేశ్వరి ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. వారితో పాటు గులివిందాడ గ్రామానికి చెందిన మరో ఇద్దరు బాలికలు జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరంతా వచ్చేనెల 10,11,12 తేదీల్లో భోగాపురంలో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం బి.సునీత, శాప్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు అభినందించారు.

బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు భారతి

జామి: ఈ రబీ సీజన్ నుంచి పంటబీమా ప్రీమియంను రైతులే చెల్లించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు భారతి, కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీఏ ఎల్.విజయ అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం జామి, ఎల్.కోట, వేపాడ, కొత్తవలస, ఎస్.కోట సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న, మినుములు, పెసలు, వరి పంటకు రైతులు బ్యాంకులో గానీ, సీఎస్‌సీ సెంటర్లలో బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద రబీలో మొక్కజొన్నకు ఎకరాకు రైతువాటగా రూ.540 చెల్లించాలని, పెసలు, మినుములకు రూ.300, వరికి రూ.630 చొప్పున చెల్లించాలన్నారు. పంటబీమా, ఆయిల్‌పామ్ సాగు, రాయితీలపై వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పంట క్షేత్రాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మీ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని రామేశ్వర కాలనీకి చెందిన విద్యార్థి పూడివలస తేజకు ధీరా ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. విద్యార్థి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయాన్ని ధీరా ఫౌండేషన్ దృష్టికి తీసుకువెళ్లగా.. ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ వెంటనే స్పందించారు. గరివిడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి చేతులమీదుగా ఆ విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు. బాగా చదువుకోవాలని సూచించారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి


ఉప్పు వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ నాగమణి

గజపతినగరం: మరుపల్లి ఆదర్శ పాఠశాలలో స్వీట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే లాభనష్టాలను ఐసీడీఎస్ పీఓ నాగమణి విద్యార్థులకు వివరించారు. అయోడిన్ లోపం వల్ల థైరాయిడ్ సమస్యతో పాటు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఉప్పు వాడకంపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఐఎస్ఐ మార్క్ కలిగిన ఉప్పు ప్యాకెట్లనే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు, స్వీట్ స్వచ్ఛంద సంస్థ నాయకుడు ఉప్పల ఈశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త రమ్య, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, సన్యాసమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

గజపతినగరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలని ఎస్టీటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకల చంద్రరావు కోరారు. గజపతినగరం మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైమరీ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కల్పిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవడం జరిగిందని, ఆవిధంగానే మన రాష్ట్రంలో కూడా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని విజ్ఞప్తి చేశారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

బొండపల్లి: వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సాగు సలహాలు, సూచనలు అందించాలని ఏరువాక కేంద్ర ముఖ్య శాస్త్రవేత్త లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ, ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి రాజశేఖర్, వ్యవసాయశాఖాధికారులు గోవిందమ్మ, మల్లికార్జునరావు, ధనలక్ష్మీ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

దత్తిరాజేరు: గ్రామాల్లో భూసమస్యలు లేకుండా పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సమగ్ర భూసర్వే డీటీ రత్నకుమారి అన్నారు. తాడేందొరవలస గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు 1బీలు రాకపోయినా, ఖాతా నంబర్లు తప్పుగా పడినా, భూముల హద్దులు మారినా, భూమి వివరాలు రికార్డులలో లేకపోయినా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి తిరుపతి, వీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

10లోగా బ్యాంక్ గ్యారెంటీ సమర్పించాలి

గంట్యాడ: రైస్‌మిల్లు యాజమానులు నవంబర్ 10వ తేదీలోగా బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలని తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రైస్‌మిల్లు యాజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి వినియోగించిన గోనె సంచులను మిల్లర్లు పీఏసీఎస్ సిబ్బందికి అందజేయాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ ఎన్.వి.వి.ఎస్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరుపై అవగాహన

గంట్యాడ: పోలీస్ వ్యవస్థ గురించి విద్యార్థులు తెలుసుకోవాలని ఎస్సై డి.సాయికృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విద్యార్థులకు పోలీసుల విధులు, ఎఫ్ఐఆర్ నమోదు, కేసుల విచారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆపదలో ఉన్న ఎవరైనా రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించవచ్చన్నారు.

29న విశాఖ డెయిరీ ముట్టడి


విశాఖ డెయిరీ ముట్టడికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేస్తున్న పాడిరైతుల సంఘం అధ్యక్షుడు

కొత్తవలస: విశాఖ డెయిరీ పాడిరైతులకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తు ఈ నెల 29న విశాఖ డెయిరీని పాడిరైతులతో కలిసి ముట్టడిస్తామని పాడిరైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొంప రాంబాబు తెలిపారు. కొత్తవలస పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం విలేకరలతో మాట్లాడారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల ధర తగ్గించడంతో పాటు సంస్థకు వచ్చిన లాభాలను యాజమాన్యం దారిమళ్లించి డెయిరీ నష్టాల్లో ఉన్నట్లు చూపుతున్నారని ఆరోపించారు. పశుదాణ, పశుగ్రాసం ధరలు పెరగడంతో రైతులకు పశుపోషణ భారంగా మారిందని, డెయిరీ యాజమాన్యం పాడిరైతుకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. దీన్ని నిరసిస్తూ డెయిరీ ముట్టడికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాడిరైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాడిరైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొంప కృష్ణమూర్తి, కార్యదర్శి లోకవరపు ఆదినారాయణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


గుర్ల: వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు


మెరకముడిదాం: వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్సై లోకేష్‌కుమార్, తదితరులు

గుర్ల: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.నారాయణరావు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్మార్ట్‌ఫోన్లు ఉపయోగించేవారంతా సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. థర్డ్‌పార్టీ అప్లికేషన్లు(యాప్‌లు) ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయొద్దని సూచించారు. ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు.

సైబర్‌నేరాలను అరికట్టడంలో యువత పాత్ర కీలకం

మెరకముడిదాం: సైబర్ నేరాలను అరికట్టడంలో యువత పాత్ర కీలకమని బుధరాయవలస ఎస్సై జె.లోకేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం ఎల్లంనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు 'సైబర్ నేరాలపై యువత పాత్ర' అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సోషల్ మీడియాను మంచిగా ఉపయోగించేందుకు యువత కృషి చేయాలన్నారు. అవాస్తవాలను ప్రచారం చేసి అనవసరంగా కేసుల్లో ఇరుక్కో వద్దని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

వేపాడ: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లంపూడి ఎస్సై దేవీ నేటి సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై విద్యార్థులను అవగాహన కల్పించారు. గంజాయి, సిగరెట్, మద్యంకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం, సన్యాసిరావు, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ


కొండగంగుబూడిలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు సిబ్బంది

వేపాడ: మండలంలో కొండగంగుబూడి పంచాయతీ పరిధిలో సబల ప్రాజెక్టు ఆధ్వర్యంలో 13 రకాల మొక్కలను శుక్రవారం రైతులకు అందచేశారు. సబల ప్రాజెక్టు ద్వారా తొలకరిలో రైతులకు నవధాన్యాలు, కాయకూరల విత్తనాలను అందించినట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రావణి తెలిపారు. ప్రస్తుతం మునగ, బొప్పాయి, అరటి, సీతాఫలం, సపోట, కరివేపాకు, అంజీరా, వాటర్ యాపిల్ తదితర 13 రకాల మొక్కలను అందజేసినట్లు చెప్పారు. ప్రధాన పంటతో పాటు రైతులకు అదనంగా ఆదాయం రావాలన్న లక్ష్యంతో మొక్కలు పంపిణీ చేసినట్లు చెప్పారు. మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో 9 గ్రామాలతో పాటు మరో పది పంచాయతీలకు మొక్కలను అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే కేజీపూడి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు 18 రకాల ఆకుకూరలు, కాయకూరలు, పండ్ల మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌పీ వెంకటరావు, జనార్దన్, ఎంటీ ఈశ్వరరావు, పెంటయ్య, మల్లేష్‌నాయుడు, సన్యాసమ్మ, రాము, వెంకటరావు, నారాయణమ్మ, సీఎస్‌ఏ శ్రీనివాస్, రైతు సేవా కేంద్రాల వీఏఏలు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన


లక్కవరపుకోట: పశు గణన సిబ్బందికి కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట: నియోజకవర్గంలో పశుగణనను పక్కాగా నిర్వహించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని మల్లివీడు గ్రామంలోని పశువైద్య కేంద్రం వద్ద 21వ అఖిల భారత పశుగణనను శుక్రవారం ఆమె ప్రారంభించారు. దీనికి సబంధించిన గోడప్రత్రికలు, గణనలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన కిట్లను అందజేశారు. అనంతరం ప్రాంతీయ పశువైద్యాధికారి బి.గంగాధర్ మాట్లాడుతూ నేటి నుంచి నాలుగు నెలల పాటు అన్ని గ్రామాల్లో పశుగణన నిర్వహించనున్నట్లు చెప్పారు. పశువైద్య సహాయకులు ప్రతి ఇంటికి వెళ్లి ఆవులు, గేదెలు, కుక్కలు, గొర్రెలు, మేకలు, తదితర పెంపుడు జంతువుల వివరాలు సేకరిస్తారని అన్నారు. దీని ఆధారంగా రానున్న ఐదేళ్లకు అవసరమైన వివిధ రకాల మందులు, రాయితీలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గణన విషయంలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తవలస, వేపాడ, ఎల్.కోట మండలాల పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- మెరకముడిదాం: కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మండలంలో పశుగణన సర్వే చేపడుతున్నట్టు మెరకముడిదాం పశువైద్యాధికారి సిహెచ్.హైమవతి అన్నారు. పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పాడిపశువుల వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

సాక్షి ఎఫెక్ట్


అప్పన్నదొరపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


గొల్లపేటలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

కొత్తవలస: మండలంలోని కాటికాపల్లి సచివాలయం పరిధి గొల్లపేటలో డయేరియా విజృంభన, అప్పన్నదొరపాలెం గ్రామంలో విషజ్వరాల వ్యాప్తిపై సాక్షి పత్రికలో శుక్రవారం 'మంచం పట్టిన పల్లెలు' అనే శీర్షికతో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు అప్పన్నదొరపాలెంలో డాక్టర్ సీతామహలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 34 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే గొల్లపేట గ్రామంలో డయేరియా అదుపులో ఉందని, ప్రస్తుతం కొత్త కేసులు నమోదు కాలేదని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. కాగా తూతూ మంత్రంగా పారిశుధ్య పనులు చేపడుతున్నారని, పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జెడ్పీటీసీ ఉదారత


జడ్పీటీసీగా పొందిన జీతాన్ని సహాయ్ సంస్థకు అందజేస్తున్న జడ్పీటీసీ వాకాడ

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి వైఎస్సార్‌సీపీ నాయకుడు, జడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు తనకు లభించిన 10 నెలల గౌరవవేతనాన్ని ఓ మంచి కార్యక్రమానికి విరాళంగా అందజేశారు. ఇటీవల ఆయన సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గరివిడిలో అంతిమ యాత్ర రథాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో మృతదేహాన్ని భద్రపరిచే ఫ్రీజర్‌ను కూడా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు జడ్పీటీసీగా ఆయన పొందిన 10 నెలల గౌరవ వేతనం రూ.60వేలను ఫ్రీజర్ కొనుగోలు చేసేందుకు సహాయ్ స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ఫెర్రో పరిశ్రమ యూనిట్ హెడ్ వాకాడ గోపి, ఉప్పు శ్రీను, బడిగంటి సీతారాం, సివ్వుకు కాంతారావు, మహమ్మద్ ఇక్బాల్, దుబాయ్ శంకర్, కెల్ల రమణ, రెడ్డి శ్రీను, మహమ్మద్ జమీల్, అన్నాజీ పాల్గొన్నారు.